క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన



దూబచర్ల జెడ్పీ హైస్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డీఈఓ అబ్రహం

నల్లజర్ల: దూబచర్ల జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం గురువారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు దాదాపు 90 శాతం పూర్తయినట్లు హెచ్‌ఎం బి.సుమతి ఆయనకు వివరించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయన అన్నారు. అనంతరం 7, 10 తరగతుల గణితం రికార్డులు పరిశీలించారు. ఆయా తరగతుల్లో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. వారిచ్చిన జవాబులతో డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు.

నూతన కార్యవర్గం ఎంపిక



ఏపీటీఎఫ్ పట్టణ నూతన సబ్ కమిటీ సభ్యులు

నిడదవోలు: స్థానిక మున్సిపల్ హైస్కూల్ నంబర్-3లో గురువారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) పట్టణ శాఖ సర్వసభ్య సమావేశాన్ని సంఘ జిల్లా జనరల్ సెక్రటరి పి.సువర్ణరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ పట్టణ సబ్ కమిటీని ఎంపిక చేశారు. పట్టణ సబ్ కమిటీ అధ్యక్షుడిగా ఏపీ అప్పారావు, ఉపాధ్యక్షులుగా ఎం.శాంతరాజు, ఎస్.సింధు, టి.నాగభూషణం, జనరల్ సెక్రటరీగా బి.వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా టి.థామస్, టి.శిరీష, ఎ.పల్లవి, యు.రమేష్‌బాబు తదితరులను ఎంపిక చేశారు.

ఇన్‌చార్జి ఆర్డీఓగా కృష్ణనాయక్



కొవ్వూరు: ఇన్‌చార్జ్ ఆర్డీఓగా రామావత్ కృష్ణనాయక్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎస్.మల్లిబాబును అమరావతిలో డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. దీంతో ప్రస్తుతం రాజమహేంద్రవరం కోనేరు రంగారావు కమిషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కృష్ణ నాయక్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జీఎస్‌టీ అండ్ కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని కృష్ణనాయక్ తెలిపారు.

కొనసాగిన రిలే దీక్షలు

దేవరపల్లి: కృష్ణంపాలెంలో ఏడాది కిందట విధి నిర్వహణలో మృతి చెందిన ఆశ వర్కర్ రమాదేవి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి నాల్గవ రోజుకు చేరాయి. సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ రమాదేవి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

దుస్తుల పంపిణీ

దేవరపల్లి: వాదాలకుంట జెడ్పీ హైస్కూల్లోని క్రీడాకారులకు 30 జతల క్రీడా దుస్తులను దేవరపల్లికి చెందిన స్టార్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పి.స్వామికుమార్ విరాళంగా అందజేశారు. ఈ దుస్తులను గురువారం దేవరపల్లిలో పీడీ ఎ.వెంకటేశ్వరరావుకు ఇచ్చారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి



కొవ్వూరులో క్రీడా సామగ్రి అందించిన కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ రాజాబాబు

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెనరా బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ ఫండ్స్ ద్వారా క్రీడా సామగ్రి అందజేసింది. ఈ పరికరాలను బ్యాంకు సీనియర్ మేనేజర్ జి.రాజాబాబు చేతుల మీదుగా విద్యార్థులు, పాఠశాల హెచ్‌ఎం ఆర్.పద్మశ్రీకి అందజేశారు. షటిల్ బ్యాట్‌లు, స్కిప్పింగ్ రోప్స్, రింగ్‌లు, క్రికెట్ కిట్, టెన్నిస్ బాల్స్, షటిల్ కాక్ సెట్‌లు, ఇతర సామగ్రి సమకూర్చారు. కొవ్వూరు కెనరా బ్యాంకు మార్కెటింగ్ మేనేజర్ కె.శ్రీకాంత్, పీఈటీ కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

దేవరపల్లి: యాదవోలు జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులకు స్థానిక కెనరా బ్యాంకు అధికారులు గురువారం రూ.10 వేల విలువైన క్రికెట్ కిట్, బాస్కెట్‌బాల్ కిట్ అందజేశారు. బ్యాంకు మేనేజర్ ఎ. సునీల్‌కుమార్, హర్ష క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం శేషగిరిరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

చాగల్లు: మార్కొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు పి.లెనిన్‌బాబు తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన అండర్-14, 17 ఎంపిక పోటీల్లో మనెల్లి సాత్విక, క్రొవ్విడి ఉమా మహాలక్ష్మిలు ఎంపికయ్యారన్నారు. విజేతలను, లెనిన్‌బాబును హెచ్‌ఎం టి.శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.చంటిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షేమంలో సరికొత్త చరిత్ర

- సీఎం జగన్‌తో అర్హులకు మేలు
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గురువారం రాజంపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేసి, అనంతరం పథకాల్లో అర్హుల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రగతికి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి పాల్గొన్నారు. ఇదిలాఉంటే బుధవారం రాత్రి కొవ్వూరుపాడులో ఎమ్మెల్యే తలారి పల్లె నిద్ర చేశారు. గురువారం ఉదయం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఎస్‌కే వల్లీ, సర్పంచ్ చిలకా లక్ష్మణస్వామి, ఎంపీటీసీ యడ్లపల్లి సూర్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే మస్తాన్ బాబా పాల్గొన్నారు.

నల్లజర్ల: అనంతపల్లి-2 సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ కమలకుమారి అధ్యక్షతన జరిగింది. గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో డిస్ ప్లే బోర్డును ఎంపీపీ బంక జయలక్ష్మి ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యులు యడ్లపల్లి మార్త, ఆరేపల్లి లక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు జాదుల దుర్గారావు, నాయకులు కారుమంచి రమేష్, గగ్గర శ్రీనివాస్, బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



రాజంపాలెంలో పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి మండలంలో 24 నుంచి..

తాళ్లపూడి: మండలంలో రెండో విడత వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం విజయవంతం చేయాలని మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరావు కోరారు. 24న మలకపల్లి, 28న పెద్దేవం, 29న పోచవరం, 30న ప్రక్కిలంక, వచ్చే నెల 1న తాడిపూడి, 4న తాళ్లపూడి సచివాలయాల పరిధిలో జరుగుతాయని తెలిపారు.

నిడదవోలు రూరల్: పేదలకు సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు కోరారు. శెట్టిపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ రూ.15.66 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.4 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలకు సంబంధించిన సమాచార బోర్డులను పల్లారావు, సర్పంచ్ జద్దు శ్రీలక్ష్మి, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు ఆవిష్కరించారు. కురసాల నెహ్రూ, జద్దు రాంబాబు పాల్గొన్నారు.



సూర్యారావుపాలెంలో..

ఉండ్రాజవరం: సూర్యారావుపాలెం సచివాలయం వద్ద జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరామయ్య ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. గ్రామంలో రూ. 33 కోట్లతో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలతో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని ఎంపీటీసీ సభ్యురాలు పెదప్రోలు వెంకటలక్ష్మి ఎగురవేశారు. పాలాటి శరత్‌బాబు, దిద్దుపూడి విశ్వనాథం, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ షాజహాన్ పాల్గొన్నారు.

మళ్లీ జగనే రావాలి

నిడదవోలు: పథకాలు అమలు కావాలంటే రాష్ట్రానికి మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. స్థానిక నెహ్రూనగర్-1 సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించారు. అనంతరం సమావేశంలో ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని అన్నారు. నెహ్రూనగర్-1 సచివాలయం పరిధి మూడు వార్డులలో ఇప్పటి వరకూ రూ.45.59 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ముంగంటి కృపానందం, మద్దిపాటి ఫణీంద్ర, కౌన్సిలర్లు ఎస్‌కే వజీరుద్దీన్, గోపిరెడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి సుప్రియ పాల్గొన్నారు.



నిడదవోలులో ప్రజలకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

దేవరపల్లి: బందపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆధ్వర్యంలో జరిగింది. గ్రామ సచివాలయం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా గ్రామంలో సుమారు రూ.27 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఎంపీపీ ఎగురవేయగా, రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ పతాకాన్ని మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ ఆవిష్కరించారు. రాత్రి గ్రామంలో పల్లెనిద్ర చేశారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకర గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు సొంటి కాశీవిశ్వనాథం, నాయకులు పెనుపోతుల సుబ్బారావు, సుంకర రాంబాబు, కరుటూరి నిత్యానందం, గుత్తికొండ అచ్యుతరావు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

ఉండ్రాజవరం: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మోర్త గ్రామంలో సుమారు రూ.65 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్ర, సర్పంచ్ చిటికెన సుజని ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం, రైతు భరోసా, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. గతంలో ప్రతి పని కోసం ప్రజలు, రైతులు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు గ్రామంలోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు వెళ్తే పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం గ్రామంలో జగనన్న కాలనీకి మండల పరిషత్ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన అప్రోచ్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. జగనన్న కాలనీ సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ కాలనీలో 248 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు. 64 మందికి ఇళ్లు మంజూరు కాగా, మిగిలిన వారికి త్వరలోనే మంజూరు అవుతాయన్నారు. 2019 ఎన్నికల్లో సీఎం జగన్ 24 లక్షల ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకూ 34 లక్షల ఇళ్లు మంజూరు చేశారన్నారు. అదే చంద్రబాబు 600 హామీలు ఇచ్చి ఎన్నికల రోజే మేనిఫెస్టోను తొలగించారని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, ఉప సర్పంచ్ దాపర్తి రామ సందీప్, ఎంపీటీసీ సభ్యులు జానీ నాగలక్ష్మి, వెలిగట్ల రాణి, పార్టీ గ్రామ అధ్యక్షుడు చిటికెన సూరిబాబు, ఎంపీడీఓ జీఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

సమిశ్రగూడెంలో గడప గడపకూ..

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సమిశ్రగూడెం సచివాలయం-2 పరిధిలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక, వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ నవరత్న పథకాలు పేదలకు వరాలుగా మారాయన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు అందినకాడకు దోచుకున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నేరుగా ప్రజల్లోకి వెళ్లి తాము చేసింది ఇదీ అని సగర్వంగా చెప్పుకుంటున్నారంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్ కృషి ఫలితమేనన్నారు. అనంతరం ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీరాణి, ఉప సర్పంచ్ గజ్జరపు నవరజిని, నాయకులు కస్తూరి సాగర్, అంగర శ్రీను, దేశాబత్తుల నాగు, వడల అంబేద్కర్, గెద్దం రవీంద్రబాబు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

మంత్రి తానేటి వనిత



మీనానగరంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని, అందుకే వచ్చే ఎన్నికల్లోనూ విజయం తథ్యమని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. మీనానగరంలో రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. మంత్రి వనిత మాట్లాడుతూ విత్తు నుంచి పంట విక్రయం వరకూ రైతన్నలకు అండగా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 10,778 రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వ్యవసాయానికి పగలు 9 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి గ్రామంలో ఆర్బీకేలు ఏర్పాటు చేసి, పంటల సాగులో రైతులకు ఆసరాగా నిలిచారన్నారు. తొలుత ఆర్బీకే ప్రాంగణంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ వైస్ చైర్మన్ పాసిన శ్రీలేఖ, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, నాయకులు గంగవరపు రాజేంద్ర ప్రసాద్, బొర్రా రజనీప్రసాద్ పాల్గొన్నారు.

టీటీడీ నిధులతో ఆలయాల నిర్మాణం

పెరవలి: నూతన ఆలయాల నిర్మాణానికి టీటీడీ నిధులు కేటాయించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. పెరవలి మండలం కాపవరంలో రూ.10 లక్షలతో కొత్తగా అభయాంజనేస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవంతుని ఆరాధనతో మనజన్మ పునీతం అవుతుందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చినప్పుడు అభయాంజనేస్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరారన్నారు. ఇది భగవంతుడి సంకల్పం అని, అందుకే కొద్ది రోజుల్లోనే నిధులు మంజూరయ్యాయన్నారు. ఇటువంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్, సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీరావు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కాపవరంలో ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

క్రీడాకారుల ప్రోత్సాహానికి 'ఆడుదాం ఆంధ్రా'

పెరవలి: క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా గేమ్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వస్తుందని కొవ్వూరు డీఎల్‌డీఓ వి.శాంతమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, బాడ్మింటన్ ఆడేవారు ఈ నెల 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో సచివాలయాల వారీగా నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారుల వయస్సు 15 ఏళ్ల దాటి ఉండాలని, ముందుగా గ్రామ స్థాయిలో, తర్వాత మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆడాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే ఈ నెల 27 నుంచి ప్రారంభించాలని అన్నారు. ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు వేండ్ర శ్రీను, ఎంపీడీఓ రమేష్, ఈఓపీఆర్డీ సీహెచ్ వెంకటరమణ, ఏఎస్ఓ వెంకట రమణ, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పెరవలిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శాంతమణి

నవరత్నాలతో పేదల ఇంట వెలుగులు

- హోం శాఖ మంత్రి తానేటి వనిత
- చాగల్లులో గడప గడపకూ..

చాగల్లు: నవరత్న పథకాలతో పేదల ఇంట వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. గురువారం చాగల్లులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 164వ రోజు కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయం-4 పరిధిలో ఆమె పర్యటించారు. తొలుత మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అక్కడ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, విద్యా కానుక కార్యక్రమాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలించారు. వైద్యం అందుకుంటున్న రోగుల వైద్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలతో వారికి చేకూరిన లబ్ధిపై బుక్‌లెట్‌లను అందజేశారు. రోడ్లు, డ్రైన్ల సమస్యలను ప్రజలు తెలపగా సంబంధిత అధికారులను పిలిచి పరిష్కరించాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి వనిత మాట్లాడుతూ ప్రజల వద్దకు వెళ్తుంటే జగనన్న పాలన గురించి ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి అబ్బులు, వర్దినేడి చినబాబు తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

ఆర్డీవోగా మల్లిబాబు సేవలు అభినందనీయం

- కలెక్టర్ మాధవీలత
- కలెక్టరేట్‌లో ఆత్మీయ వీడ్కోలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కొవ్వూరు ఆర్డీవోగా ఎస్.మల్లిబాబు అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ మాధవీలత అన్నారు. డిప్యూటీ చీఫ్ ఎలక్షన్ అధికారిగా బదిలీపై వెళుతున్న ఆయనను గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఘనంగా సత్కరించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ మల్లిబాబు జిల్లాలో సమర్థవంతంగా పనిచేసి, అందరి మన్ననలు పొందారన్నారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ రెవెన్యూశాఖ పరంగా ఎంతో అనుభవం కలిగిన మల్లిబాబు.. జిల్లా నుంచి బదిలీ కావడం మనకు లోటు అన్నారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మల్లిబాబు మాట్లాడుతూ జిల్లాలో 30 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. తనకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, కొవ్వూరు ఆర్డీవో కృష్ణ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరళ వందనం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భాను ప్రకాష్ పాల్గొన్నారు.



మల్లిబాబును సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

పారదర్శకంగా కుల గణన చేపట్టాలి

కొవ్వూరు: ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న కులగణనను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ఇన్‌చార్జి ఆర్డీఓ రామావత్ కృష్ణనాయక్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కుల గణన సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియను డిసెంబర్ పదో తేదీకి పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ, సచివాలయాల స్థాయిల్లో సిబ్బందికి శిక్షణ పొందిన గ్రేడ్-5 కార్యదర్శుల ద్వారా శిక్షణ అందించాలని సూచించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టాలన్నారు. సర్వేలో ఎనిమిదేళ్ల వయసు కంటే తక్కువ వయసున్న పిల్లలను మినహాయించి మిగిలిన కుటుంబ సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో సమీక్షించారు. తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఈవోపీఆర్‌డీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా కుల గణన

నల్లజర్ల: కుల గణనను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ కిశోర్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. కుల గణనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన లెక్కింపులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. 1993 తర్వాత ఇన్నేళ్లకు కుల గణన జరుగుతుందని, ఆయా కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. ఎంపీడీఓ రాజశేఖర్, ఈఓపీఆర్డీ సింహాద్రి, పుల్లలపాడు సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.




కొవ్వూరులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీఓ కృష్ణనాయక్

వైభవం.. సీతారాముల కల్యాణం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణ వేడుక గురువారం ఘనంగా జరిగింది. భద్రాద్రి శ్రీరామచంద్రమూర్తి దేవస్థానం ఆధ్వర్యంలో ఊరూరా శ్రీరామ కల్యాణ రథయాత్రలో భాగంగా దేవరపల్లిలో కల్యాణం నిర్వహించారు. భద్రాద్రి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత శ్రీరాముడిని పెండ్లి కుమారుడిగా, సీతాదేవిని పెండ్లి కుమార్తెగా అలంకరించి అర్చకులు కల్యాణ వేదికపైకి తీసుకువచ్చి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు అవసరమైన పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను వేంకటేశ్వరస్వామి వారి ఆలయం తరపున చైర్మన్ అంబటి శ్రీనివాస్ దంపతులు అందజేశారు. స్థానిక షిర్డీ సాయిబాబా మందిరం, పల్లపువీధి రామాలయం ద్వారా దాపర్తి వీరభద్రరావు దంపతులు, మెరకవీధి రామాలయం ద్వారా తీగల బలరామయ్య, లక్ష్మీపతి రాజు, భక్తాంజనేయ ఆలయం ద్వారా తీగల శ్రీనివాస్ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు అర్చకులు కల్యాణ అక్షితలు అందజేసి ఆశీర్వదించగా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తజనం భారీగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

వేంకటేశ్వరుని సప్తాహాలు ప్రారంభం

కొవ్వూరు: కార్తిక మాసం సందర్భంగా ఆరికిరేవుల గ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక సప్తాహాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలుత గోదావరి జలాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి పంచామృతాలతో పూజలు, సహస్ర నామార్చన నిర్వహించారు. తర్వాత అఖండ నామ సంకీర్తన చేశారు. గ్రామానికి చెందిన యనమదల తాతాలు, చావా సూర్యారావు కుటుంబ సభ్యుల చేతుల మీదుగా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు గుత్తా వెంకటకృష్ణ, యనమదల రామారావు, చావా వెంకట్రావు, పోతుల ఎకో నారాయణ, చావా రామారాయుడు తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో శ్రీసీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

ఇళ్ల నిర్మాణానికి చర్యలు



లబ్ధిదారుల సమస్యలు వింటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాను ప్రకాష్‌రెడ్డి

గోపాలపురం: స్థానికంగా జగనన్న కాలనీలకు సేకరించిన స్థలాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.భాను ప్రకాష్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఇచ్చిన స్థలం నిర్మాణాలకు అనుకూలంగా లేదని ఆయనకు లబ్ధిదారులు వివరించారు. దీనిపై భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే రెండుసార్లు లబ్ధిదారుల అభ్యర్థన మేరకు స్థలంలో మైనింగ్, జూవాలజీ అధికారులతో పరిశీలించామన్నారు. వారి నివేదిక ఆధారంగా ఇంటి నిర్మాణాలకు అనుకూలంగా ఉన్నట్లు తేలిందన్నారు. అందువల్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరలో ఇంటి నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. బేస్‌మెంట్ లెవెల్ వరకూ వేసిన వెంటనే రూ.60 వేల నగదు, 30 బస్తాల సిమెంట్, స్లాబ్ లెవెల్‌కు వచ్చిన తర్వాత రూ.లక్ష, మరియు ఉపాధి హామీ పథకంలో మరో రూ.20 వేలు కలిపి రూ.ఒక లక్షా 80 వేలు ఇస్తారన్నారు. తక్షణమే లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి ఇతర అధికారులు ఉన్నారు.

బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్‌గా ముత్యాలరావు



రామచంద్రరావు, ముత్యాలరావులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: నియోజకవర్గ అసెంబ్లీ బీజేపీ కో-కన్వీనర్‌గా బొడపాటి వెంకట ముత్యాలరావు నియమితులయ్యారు. గురువారం స్థానిక పీఆర్ఆర్ కల్యాణ మండపంలో పట్టణ బీజేపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ శాఖ అధ్యక్షుడిగా మడిచర్ల రామచంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ఇద్దరినీ సభ్యులు ఘనంగా సత్కరించారు. నాయకులు పరిమి రాధాకృష్ణ, తాడిమళ్ల విజయవాణి, పిల్లలమర్రి మురళీకృష్ణ, బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, ఆలపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



గోపాలపురంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

గోపాలపురం: సత్యసాయి జయంతి సందర్భంగా గురువారం గోపాలపురం సత్యసాయి ఆలయం వద్ద 98 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం సత్యసాయి ఆలయం వద్ద పేదలకు అన్న సమారాధన, దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు దాతలు కర్లపూడి చిన్నబ్బాయి, జలావతి, బాలగోపాల భాస్కరరాజు, గేదల మంగాయమ్మ తెలిపారు.

నల్లజర్ల: సత్యసాయి జయంతి సందర్భంగా గురువారం అనంతపల్లిలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి నల్లజర్ల మండల మాజీ కన్వీనర్ మంచిరాజు రాజగోపాల భుజంగరావు ఆధ్వర్యంలో నగర సంకీర్తన, అభిషేకాలు, భజనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

నిడదవోలు రూరల్: బేతెస్థ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు ఎన్వీ రావు జన్మదిన వేడుకలు పురస్కరించుకుని సంఘ విశ్వాసులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమిశ్రగూడెం బేతెస్థ వర్షిప్ సెంటర్‌లో వృద్ధులకు దుప్పట్లను ఎన్వీ రావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

వివాహిత అదృశ్యం

నిడదవోలు రూరల్: పురుషోత్తపల్లికి చెందిన వివాహిత బట్టు ప్రసన్న అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. ఈ నెల 18న ప్రసన్న ఇంటి నుంచి వెళ్లిపోయిందని భర్త సురేష్ ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: మనస్తాపానికి గురై మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగిన పెండ్రా అమ్మోను (23) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. చాగల్లు మండలం రామచంద్రపురానికి చెందిన అమ్మోను భార్య కుమారితో గొడవ పడి 19న కాటకోటేశ్వరంలో రైతు గుంటుపల్లి సాయి పొలంలో పురుగు మందు తాగాడు. అతన్ని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తండ్రి రాము ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.